ఆక్రమణలు తొలగవు.. సాగు సాగదు

ముదినేపల్లి రూరల్: దళితులకు సాగు హక్కులు కల్పించాలని ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఆక్రమణలు తొలగించాలని పలువురు రెవెన్యూ అధికారులను కోరారు.

317 మందికి పట్టాల పంపిణీ..

మండలంలోని వైవాక గ్రామంలో 95 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిని గతంలో కొంతమంది దళితులు సాగు చేసుకుంటుండగా మరికొంతమంది అగ్రవర్ణాల వారు ఆక్రమించుకుని చెరువులను తవ్వారు. వీటికి పట్టాలు పంపిణీ చేయాలని అనేక సంవత్సరాలుగా దళితులు పోరాటం చేస్తుండగా 2022 మార్చిలో అప్పటి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కృషితో ఒక్కొక్కరికి 30 సెంట్లచొప్పున 317 మంది దళితులకు పట్టాలు అందజేశారు. వీటిలో చేపలుకాని, రొయ్యలు కాని సాగుచేసుకోవచ్చు.

సమస్య ఇదీ..

ఈ భూముల్లో సుమారు 20 ఎకరాలు ఆక్రమణలో ఉండగా పట్టాలు పంపిణీ చేసినప్పటికీ ఆక్రమణదారులు వైదొలగలేదు. అప్పటి నుంచి స్థానిక దళిత నాయకుడు పోడ్రు జోషి ఆధ్వర్యంలో పలువురు దళితులు ఆక్రమణదారులను తొలగించడంతో పాటు పట్టాలు పొందిన వారి భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.


ఆక్రమణలకు గురైన చెరువును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కలెక్టర్‌కు ఫిర్యాదు..

దీనిపై మూడు నెలల కిందట దళితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా 90 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. 90వ రోజు ముగుస్తుందనగా శుక్రవారం ఆర్‌ఐ రాజశేఖర్, స్థానిక వీఆర్‌ఓ చెరువును పరిశీలించేందుకు వెళ్లారు. దీనిపై దళిత నాయకుడు పోడ్రు జోషి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 90 రోజుల నుంచి సమస్యను పరిష్కరించకపోగా చివరి రోజున పరిశీలించేందుకు రావడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఆక్రమణదారులకు ఇప్పటివరకు నోటీసులు జారీ చేయనందున వైదొలగడం లేదని ఆర్‌ఐ దృష్టికి తెచ్చారు.

మరో 25 ఎకరాలు..

అదేవిధంగా 95 ఎకరాల చెరువును ఆనుకొని మరో 25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దీనిని దళితులకు కేటాయించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని జోషి తెలిపారు. స్పందించిన ఆర్‌ఐ రాజశేఖర్ మాట్లాడుతూ 25 ఎకరాల భూమికి సంబంధించి అసైన్డ్ కమిటీ వేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారని, ఇతర సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

క్లుప్తంగా

ముమ్మరంగా నేషనల్ హైవే విస్తరణ పనులు



మండవల్లి: విజయవాడ- భీమవరం లైన్‌లో ఉన్న మండవల్లిలో నేషనల్ హైవే విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సూపర్‌వైజర్ నాగరాజు పర్యవేక్షణలో డ్రెయినేజీ పనులు చేస్తున్నారు. ఈ కారణంగా రహదారిని పూర్తిగా మూసివేసి పనులు చేస్తున్నారు. దీంతో వాహనచోదలకులను, పాదాచారులను వెళ్లనీయకుండా అడ్డుకట్ట వేయడంతో వారికి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఆలయం వద్ద అన్నసమారాధన



కైకలూరు: మండలంలోని కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద శుక్రవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ నెల 1వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అమ్మవారి జాతర అత్యంత వైభవంగా నిర్వహించారు. జాతర ముగింపు, నూతన అనివేటి మండపం నిర్మాణాన్ని పురస్కరించుకుని దేవాలయం వద్ద నిర్వహించిన అఖండ అన్నసమారాధన 3,000 మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చలివేంద్రం ప్రారంభం



కైకలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపై ఆ కార్యాలయ సిబ్బంది చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం చలివేంద్రాన్ని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం ప్రారంభించారు. అలాగే కార్యాలయ ఆవరణలో పక్షులకు తాగునీరు, ఆహారాన్ని ఏర్పాటు చేశారు. చిన్న పెట్టెలలో పక్షులకు గింజలు, నీటిని ఉంచారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



గుడివాడరూరల్: వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎస్.చంటిబాబు కోరారు. మండలంలోని మల్లాయపాలెం పంచాయతీ పరిధిలోని అలంకృత ఫంక్షన్ హాల్ సమీపంలో శుక్రవారం వాహనాల తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త భవనంలోకి యూబీ శాఖ మార్పు



గుడ్లవల్లేరు: యూనియన్ బ్యాంక్ శాఖను స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనున్న రోడ్డులో నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్పు చేశారు. శుక్రవారం ఈ బ్రాంచిని రీజినల్ హెడ్ కె.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఆ బ్రాంచి మేనేజర్ కె.సంతోష్, వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు పడమటి సుజాత, శ్రీ కొండలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బాడిగ నాని, చినగొన్నూరు సర్పంచి కోటప్రోలు నాగు ఉన్నారు.

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): భారత సైన్యంలో చేరేందుకు అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌కు అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులకు వచ్చేనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

దివ్యాంగులకు బహుమతులు అందజేత

ఎలకుర్రు(పామర్రు): ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సేవలు ప్రశంసనీయమని యూనియన్ బ్యాంక్‌మేనేజర్ కె. శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని ఎలకుర్రు గ్రామంలో కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య (కేడీబీ) ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పాఠశాలలో శుక్రవారం వరల్డ్ డౌన్ సిన్‌డ్రోమ్ సెలబ్రేషన్ డే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సరైన అవకాశాలను తల్లిదండ్రులు, సమాజం కల్పించ గలిగితే వారు స్వతంత్ర్యంగా జీవించగలరని అన్నారు. జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం చే ఏర్పాటు చేయబడిన నేషనల్ ట్రస్టు, కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారన్నారు. దివ్యాంగులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తే నిష్ణాతులుగా మారే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అనంతరం దివ్యాంగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు కాశీనాథుని నాగేశ్వరరావు కేడీబీ ట్రస్టు డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కళాశాల అధ్యాపకురాలు వై.ప్రసన్నకుమారి, కేడీబీ ట్రస్టు ప్రిన్సిపాల్ డి.వసుంధర, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు, పక్కన పీఏసీఎస్ అధ్యక్షుడు

పౌష్టికాహారం అందరికీ అవసరం

కైకలూరు: పౌష్టికాహారం నేటి సమాజంలో అందరికీ ఎంతో అవసరమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటేష్ చెప్పారు. కైకలూరు వ్యవసాయశాఖ కార్యాలయం సమావేశ మందిరంలో డ్వాక్రా, వ్యవసాయ, పశుసంవర్ధక, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శుక్రవారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం బలోపేతం చేస్తూ ముందుకు తీసుకువెళ్లడానికి సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. వ్యవసాయశాఖ ఏడీ గంగాధరరావు మాట్లాడుతూ భూమి ఆరోగ్యమే మొక్క ఆరోగ్యమని, మొక్కల ఆరోగ్యమే మనుషుల ఆరోగ్యమని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రకృతి వ్యవసాయ రైతులను సన్మానించారు. అనంతరం ద్రవజీవామృతం తయారీని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఆర్.గంగాధరరావు, పశుసంవర్ధకశాఖ ఏడీపీ పటాన్ ముస్తఫాఖాన్, కైకలూరు, కలిదిండి వ్యవసాయాధికారులు దివ్య, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


ద్రవజీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రోగులకు ఉచిత వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో గుడివాడ రోటరీ క్లబ్ శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్.ఆర్.జి.ఈ.సి. ఫ్యాకల్టీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు పాల్గొని మధుమేహం, రక్తపోటు, హృద్రోగ, గర్భ, చర్మ వ్యాధులు, నరాల సమస్యలు వంటి వాటిపై ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, వ్యాధి తీవ్రతను అనుసరించి అవసరమైన వారికి అల్లోపతి ఔషధాలను ఉచితంగా పంపిణీ చేశారు. కళాశాల ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ వైద్యులు, ఫ్యాకల్టీ క్లబ్ సభ్యుల సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమంలో చివరగా రోటరీ క్లబ్ సభ్యులకు, వివిధ విభాగాల్లో వైద్య సేవలందించిన వైద్య బృందానికి ఫ్యాకల్టీ క్లబ్ సభ్యులు, ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ జ్ఞాపికలను బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ అధ్యక్షుడు టి.ఎం.రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్ బాబు, మాజీ అసిస్టెంట్ గవర్నర్ వై.రెడ్డయ్య, మాజీ అధ్యక్షుడు ఎ.సుబ్రహ్మణేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి జి.నరేష్, సభ్యులు వై.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు,టి.ఉమామహేశ్వరరావు, జి.టి. ఎస్.వీరేంద్ర, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్. శాస్త్రి, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్ర బాబు, డైరెక్టర్ డాక్టర్ జి.ప్రసాద్, ఫ్యాకల్టీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వి.వి.కె.డి.వి.ప్రసాద్, ఇతర ఫ్యాకల్టీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బ్యాంకులో చోరీకి విఫలయత్నం

కూచిపూడి(మొవ్వ): మండలంలోని కూచిపూడి సప్తగిరి గ్రామీణ బ్యాంకులో చోరీకి విఫలయత్నం చేసిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. కూచిపూడిలోని బార్లపూడి రోడ్‌లో బస్ స్టేషన్ అవుట్ గేట్ ఎదురుగా బ్యాంకులో ఎంట్రన్స్‌లో గల సీసీ కెమెరాని విరగకొట్టారు. తాళాలు పగల కొట్టే ప్రయత్నం చేయగా తాళాలు రాక పోవటంతో దుండగులు వెనుతిరిగి నట్లు సమాచారం. రోజు మాదిరిగానే బ్యాంకు ఉద్యోగి వెళ్లి చూడడంతో చోరీకి విఫలయత్నం సమాచారం వెలుగు చూసింది. బ్యాంక్ మేనేజర్ వి.శ్రీనివాసరావు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై కే నాగ విశ్వనాథ్, పామర్రు సీఐ వి.సుభాకర్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మచిలీపట్నం నుంచి క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. కాగా సమీపంలోని సీసీ కెమెరాల పరిశీలన చేసేపనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని, జాగ్రత్త పడాలని సూచించారు.


సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న కూచిపూడి ఎస్‌ఐ

వక్కలగడ్డలో రైతు సదస్సు

చల్లపల్లి: సర్వే బృందాలతో పూర్తి చేసిన సర్వేకు సంబంధించి తయారు చేసిన 9(2) నోటీసులను రైతులకు అందించేందుకు చల్లపల్లి తహసీల్దార్ డీ వనజాక్షి మండలంలోని వక్కలగడ్డ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం స్థానిక రైతులతో సదస్సు నిర్వహించారు. వక్కలగడ్డ గ్రామాన్ని రీ-సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని కూటమి ప్రభుత్వంలో సర్వే నిర్వహించారు. గ్రామంలోని భూములకు సంబంధించిన నోటీసులను రైతులకు అందజేశారు. ఆ నోటీసుల ద్వారా ప్రతిరైతు వారి యొక్క భూమి కొత్త ఎల్‌పీఎం సర్వే నెంబర్, విస్తీర్ణం సరిచూసుకోవాలని సూచించారు. సదస్సులో ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్, ఆర్ఎస్ డీటీ నీలిమ, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో ఆరోగ్యవంతమైన నేల

ఘంటసాల: వర్మీ కంపోస్టు వినియోగించడం ద్వారా ఆరోగ్యవంతమైన నేల ఏర్పడుతుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డీ సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు వానపాముల ఎరువు తయారీపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల మీద పూర్తిగా ఆధారపడటం వల్ల మనకు మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాములు అంతరించిపోతున్నాయని చెప్పారు. కేవీకే సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం వెంకటలక్ష్మి మాట్లాడుతూ నేల ఆరోగ్యంగా ఉండాలంటే వర్మీ కంపోస్టు ఎరువు ఉపయోకరమైందన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి స్థలం వితరణ



గుడ్లవల్లేరు: వెణుతురుమిల్లిలో రూ.4 లక్షల విలువైన 299 గజాల స్థలాన్ని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికై కొల్లిపర సత్యనారాయణ రావు, సత్యవతి జ్ఞాపకార్థం వారి కుమారులు, కుమార్తెలు వితరణగా ఇచ్చారు. వారి సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేయించి, ఆ పత్రాల్ని శుక్రవారం ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగ మల్లేశ్వరరావుకు అందించారు. తమ గ్రామ అభివృద్ధిలో తమ తల్లిదండ్రుల ఆశీస్సులతో వారి వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని కొల్లిపర అనసూయ, పార్థసారథి దంపతులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ ప్రజలందరూ వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

పశు వైద్య శిబిరం

పమిడిముక్కల: లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్, లయన్స్ క్లబ్ ఆఫ్ కపిలేశ్వరపురం సంయుక్త ఆధ్వర్యంలో కపిలేశ్వరపురంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని లయన్స్ జిల్లా గవర్నర్ గద్దే శేషగిరిరావు ప్రారంభించారు. పశువైద్యులు రవికుమార్, రామ్‌నరేష్, ఈశ్వర్ పశువులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని లయన్స్ ప్రతినిధులు సూర్యదేవర శ్రావణ్, కడియాల ప్రకాశం, చిగురుపాటి జగదీష్, తుమ్మల గంగాధరరావు పర్యవేక్షించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్- 2025 పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ మచిలీపట్నంలోని పోలీస్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ పోటీలలో పలు విభాగాలలో విజయం సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం శుక్రవారం అభినందించారు. అండర్- 14 బాలబాలికల వ్యక్తిగత కటా విభాగంలో బి. అఖిల్ కార్తికేయ, బి.చాతుర్య, కె.దీపక్ కృష్ణసాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ, అండర్- 11 విభాగంలో ఎల్.పార్వతి ప్రథమ, అండర్- 10 విభాగంలో వై.కీర్తి వర్షిణి, కె.వేదశ్రీ నాగేంద్రకుమార్, పి.శాన్వి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను, కోచ్ ఎస్.వెంకటేశ్వరరావులను పాఠశాల ప్రిన్సిపాల్స్ ఎం. సత్యారామ్, జ్యోతి, ప్రశాంతిలు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలి

మొవ్వ: రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొంటుదని ఎన్నికల ముందు ఉదరగొట్టిన రాష్ట్ర ప్రభుత్వం మార్చి 31తో కొనుగోలు కేంద్రాలను మూసి వేయటం రైతులను అన్యాయం చేయటమేనని కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణా జిల్లాలో ఖరీఫ్ సీజన్ సంబంధించి 2024- 25 ధాన్యం సేకరణ ఈనెల 31 తేదీ వరకు మాత్రమే అని ప్రకటించడం రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లం ఘించడమే అన్నారు. జిల్లాలో ఇంకా 30 శాతం వరకు వరి కుప్పలు నూర్పుళ్లు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రైతులు మినుము పంట నూర్పుళ్లు చేస్తున్నారు. మార్చి 31 డెడ్ లైన్ ఉపసంహరించుకుని చివరి గింజ వరకు రైతుల నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ఏపీ కౌలు రైతు సంఘం తరుపున డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి సాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలికి చెందిన మాడే శేఖర్ అకస్మాత్తుగా మరణించగా మండలంలోని బొర్రా బాలసాయి చారిటబుల్ ట్రస్ట్ రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందజేసింది. ట్రస్ట్ తరపున రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ శేఖర్ కుటుంబసభ్యులకు సాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వీరమల్లు నరసింహారావు, యర్ర రాంబాబు, బాసింశెట్టి కిషోర్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

గుడివాడ టౌన్: ఇచ్చిన హామీలు నిలుపు కోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. శుక్రవారం స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని మియాఖాన్ మసీదు(పెద్ద మసీదు)లో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లపై విమర్శలు చేశారు. 40 సంవత్సరాల ఇండస్ట్రీ చంద్రబాబు నాయుడు, ఆయన తొత్తు పవన్ కల్యాణ్‌లకు మాట నిలుపుకోవడం తెలియదన్నారు. ఇచ్చిన హామీలను ఎలా అమలు చెయ్యాలి, మాటకు ఎలా కట్టుబడి ఉండాలి అనే అంశాలపై వీరిరువురు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి వద్ద శిక్షణ పొందాలన్నారు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ అని షణ్ముఖ వ్యూహం అని సంక్షేమ హామీలు ఇచ్చారన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చెయ్యకుండా స్కిప్పులు వేసుకుంటూ బతుకుతున్న కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల అరెస్టుల వలన వారు మానసికంగా ఆనందపడతున్నారే తప్ప వైఎస్సార్ సీపీకి, మా నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి గానీ జరిగే నష్టం ఏమీ ఉండదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కే బాజీ, పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి పేర్ని నాని

శాంతిభద్రతలపై సమీక్ష

గుడివాడరూరల్: నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పోలీస్ అధికారులకు సూచించారు. రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో గుడివాడ వన్, టూటౌన్, తాలూకా సీఐలు కొండపల్లి శ్రీనివాస్, చిన్ని నాగప్రసాద్, ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంజాయి నియంత్రణ, క్రికెట్ బెట్టింగ్, ఇతర జూదాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి, బెట్టింగ్‌లు, ఇతర జూదాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మల్లాయపాలెం పరిధిలోని టిడ్కో సముదాయం వద్ద అసాంఘిక శక్తులు ప్రబలకుండా ప్రత్యేక పోలీస్ టీంలను ఏర్పాటు చేయాలని తాలూకా సీఐకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఆరాచక శక్తులు ఎంతటి వారైనా అణచివేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావేదిక నిర్వహణ

మండలంలోని చౌటపల్లి గ్రామంలో ఎమ్మెల్యే రాము ప్రజా వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలగలేటి ర మ్య, ఎంపీడీవో బీవై విష్ణుప్రసాద్, ఎంఏవో బోలెం అనంతలక్ష్మి, ఆర్‌ఐ నాగబాబు, పంచాయతీరాజ్ ఏఈ సూరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిస్మత్‌రాణి, పంచాయతీ కార్యదర్శులు వి.హరికృష్ణ, దేవీచరణ్, వీఆర్వో శ్రీనివాసరావు, కూటమి నాయకులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


సీఐలతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాము

తాగునీటి సమస్య రాకుండా చూడండి

గుడివాడ టౌన్: ప్రస్తుత వేసవి కాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు నీటి అవసరాలు ఎక్కువగా ఉంటాయని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు పూర్తి స్థాయిలో నింపాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

గుడ్లవల్లేరు: స్థానిక వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ గుడివాడ సౌజన్యంతో కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ఈ శిక్షణ జేసీఐ సెక్రటరీ జె.సి.కె మోనిష్ వర్మ, వైస్ ప్రెసిడెంట్ జేసీ అన్నం చిన్న వీర స్వామి, ప్రెసిడెంట్ జె.సిహెచ్ జి.ఎఫ్.లక్కీ జైన్, ట్రైనర్ జె.ఎఫ్.ఎస్.కృష్ణ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిగత, వృత్తి రంగాలలో విజయం సాధించడానికి అవసరమైన కమ్యూనికేషన్ సమర్థత, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి గల సూచనలు, సలహాలను అందించారు. విద్యార్థులకు తమ బలాలు, బలహీనతలను తెలుసుకునే కొన్ని ఆక్టివిటీస్‌ను చేయించారు. విద్యార్థులకు ఒక విషయాన్ని వ్యక్తపరచడంలో భాష ఎంత ప్రాముఖ్యత వ్యవహరిస్తుందో ముఖ కవళికలు హావభావాలు కూడా అంతే ప్రాధాన్యతను ఇస్తాయని తెలిపారు. ఎదురయ్యే ప్రతి పరిస్థితి నుంచి ఒక మంచి విషయం నేర్చుకోవాలని చెప్పారు. విద్యార్థులకు లక్ష్యం ఎలా నిర్దేశించుకోవాలి, దానిని ఎలా చేరుకోవాలి, సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి అనే అంశాలపై సూచనలను అందించారు. చివరిగా వచ్చిన అతిథులకు మెమెంటో బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ప్రతినిధి డాక్టర్ టి.బాలకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ ఎస్‌కే అమీనాబీ, డాక్టర్ పి.రవిష, డాక్టర్ టి.ప్రశాంతి, బి.సత్య శ్రీ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన విద్యార్థులు

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

గుడ్లవల్లేరు: యూఎఫ్‌బీయూ పిలుపు మేరకు ఈ నెల 24, 25వ తేదీలలో జరగవలసిన బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా పడినట్టు యూనియన్ నాయకుడు చిలుముల అభయాంజనేయ స్వామి శుక్రవారం తెలిపారు. ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్, పార్లమెంట్ ఆఫ్ ఫైనాన్స్ సర్వీసెస్‌తో జరిగిన చర్చలు కొంత మేరకు సఫలం అయ్యాయని ఆయన చెప్పారు. ఏప్రిల్‌లో మరొక సారి చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని తెలియజేయడంతో బ్యాంక్ ఉద్యోగుల సంఘం దేశ వ్యాప్తంగా జరగవలసిన సమ్మె వాయిదా వేశారని ఆయన తెలిపారు. నాయకులు మల్లిఖార్జునరావు, శ్రీనివాసరావు, రవికాంత్ ఉన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల సత్తా



పమిడిముక్కల: కడప జిల్లా పులివెందులలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో కృష్ణాజిల్లా బాలబాలికల జట్టు తృతీయ స్థానం సాధించారు. ఈ జట్టుకు తాడంకి హైస్కూల్ విద్యార్థులు బోయి వెంకటలక్ష్మి, కొల్లి వెంకట్‌లు ప్రాతినిధ్యం వహించారు. హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ రవీంద్రబాబును హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

